క్లుప్తంగా

28లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉప ఖజానా కార్యాలయం నుంచి ప్రతి నెలా పింఛన్ తీసుకునే విశ్రాంత ఉద్యోగులు విధిగా లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 28లోగా ఉపఖజానా కార్యాలయంలో అందించాలని ఇన్‌చార్జి ఎస్టీఓ సుబ్బారావు ప్రకటనలో సూచించారు. చీరాల ఉపఖజానా కార్యాలయం పరిధిలోని చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు మండలాలకు చెందిన ఉద్యోగులకు జీతాల బిల్లులు త్వరగా పంపిస్తున్నామన్నారు. ఉప ఖజానా కార్యాలయం పరిధిలో ఉన్న 3395 మంది విశ్రాంత ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 28లోగా ఉప ఖజానా కార్యాలయంలో అందించాలని కోరారు.

వీధుల వెంట చెత్త వేస్తే చర్యలు

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని ఈవోఆర్డీ రామకృష్ణ సూచించారు. శుక్రవారం తోటవారిపాలెం గ్రామ పంచాయతీలో చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఈవోఆర్డీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు వచ్చి చెత్తను సేకరిస్తున్నారని ఇంటి నుంచి వచ్చే చెత్తను పంచాయతీ కార్మికులకు అందించాలన్నారు. అలా కాకుండా ఇళ్లల్లోని చెత్తను బైటకు తీసుకొచ్చి రోడ్డు పక్కన ఖాళీ స్థలాల్లో వేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు కూడా చేపడుతున్నామన్నారు. రోడ్లపై మురుగునీరు నిల్వలు లేకుండా కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు కూడా తీసుకోవాలని కోరారు. మురుగు కాల్వల వద్ద ఎబేట్‌ను పిచికారీ చేయాలన్నారు. రోడ్డు మార్జిన్‌ల వద్ద చెత్తను సేకరించి అక్కడ బ్లీచింగ్ చల్లించారు. గ్రామాల్లో ప్రజలు కూడా సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సేవా కేంద్రం ప్రారంభం


రాచపూడిలో ప్రకృతి వనరుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ శ్రీనివాసరావు


మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో ప్రాసంగులపాడు యూనిట్ ఆధ్వర్యంలో రాచపూడి గ్రామంలో ప్రకృతి వనరుల విక్రయ సేవాకేంద్రాన్ని ఏవో శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయం మంచిదన్నారు. తక్కువ ఖర్చుతో కషాయాలు ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. మహిళా సమాఖ్య ద్వారా ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలన్నారు. పి.భార్గవి, ఏపీఎం మాణిక్యారావు, సీసీ సాంబయ్య, మహిళా సమాఖ్య మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సీడీ సర్వేతో మేలు


జరుబులవారిపాలెంలో పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ నూర్జహాన్

కారంచేడు: నాన్ కమ్యునికబుల్ డిసీజెస్ అండ్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ సీడీ) పై వైద్య సిబ్బంది చేస్తున్న 3.0 వర్షన్ సర్వేతో పేదలకు మేలు జరగుతుందని వైద్యాధికారి డాక్టర్ శాలిని అన్నారు. శుక్రవారం స్వర్ణ, కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం గ్రామాల్లో వైద్య సిబ్బంది చేస్తున్న ఎన్‌సీడీ సీడీ సర్వే పరిశీలించారు. ఇప్పటికే ఒక దఫా సర్వేను పూర్తి చేశామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆయుష్మాన్ భారత్ వంటి పథకం ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించే ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు. సర్వే పూర్తి అయిన తరువాత వారికి ఒక కోడ్ వస్తుందని తెలిపారు. ఏ నెట్‌వర్క్ ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళినా ఈ కోడ్ కొట్టిన వెంటనే ఆ వ్యక్తి ఆరోగ్యం, వ్యాధుల వివరాలను చూపిస్తుందన్నారు. దీని ద్వారా వెంటనే వైద్యం అందించే వీలుంటుందన్నారు. ఎంపీహెచ్‌ఈఓ వి. నాగేశ్వరరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం


చిన్నారులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి కీర్తి సరోజ్

చినగంజాం: దివ్యాంగులైన బాలబాలికలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్య, వైద్యం అందించడంతో పాటు అన్ని విధాలుగా ఆదుకుంటుందని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కీర్తి సరోజ్ అన్నారు. కడవకుదురులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, రెండు ప్రాథమిక పాఠశాలలు, 5 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఆరోగ్యవిద్య, పోషకాహార విలువలు గురించి తెలియజేశారు. ఆడపిల్లలకు కనీస హక్కుల గురించి తెలియజేశారు. ముగ్గురు దివ్యాంగులైన చిన్నారులను గుర్తించారు. మండల పారాలీగల్ సెల్ అడ్వకేట్ ఏ. రామకృష్ణారెడ్డి, పారాలీగల్ వలంటీర్ ఎంవీ రామారావు, హెచ్ఈఓ యు. వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీలు రమ్య, స్మైలీ, ఏఎన్ఎంలు ఎం. శారద, శిరీష, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంతో ఇక్కట్లు


భారీ యంత్రాలతో ఈపురుపాలెంలో ఫ్లై ఓవర్ పిల్లర్ నిర్మిస్తున్న దృశ్యం


హైవే నిర్మాణ పనుల కారణంగా మూసివేసిన జీబీసీ ప్రధాన రోడ్డులోని ఈపురుపాలెం బ్రిడ్జి

- ఈపురుపాలెం బ్రిడ్జి మూసివేత
- రాకపోకలకు తీవ్ర ఆటంకం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ప్రయాణికులు

చీరాల టౌన్: నిత్యం వందలాది వాహనాలతో రాకపోకలు సాగించే చీరాల-బాపట్ల-గుంటూరు ప్రధాన రహదారిలోని (జీబీసీ) ఈపురుపాలెం బ్రిడ్జిని మూసేశారు. వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మిస్తున్న 167-ఏ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఈపురుపాలెం స్టయిట్‌కట్ బ్రిడ్జి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్

పిల్లర్ల నిర్మాణం చేపట్టడంతో ఈపురుపాలెం నుంచి చీరాల వచ్చే ప్రధాన రహదారిపై రాకపోకలు నిషేధించారు. భారీ యంత్రాల సాయంతో నిర్మిస్తున్న పిల్లర్ల కారణంగా ఈపురుపాలెం బ్రిడ్జి నుంచి చీరాల-బాపట్ల వైపు వెళ్లే దారి మూసివేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో వీఆర్ఎస్ కళాశాల బైపాస్ నుంచి తోటవారిపాలెం వీవర్స్ కాలనీ వద్ద ఉన్న బ్రిడ్జిపై నుంచి కుందేరు పక్కన రోడ్డు నుంచి ఈపురుపాలెం గ్రామంలోకి రావాల్సి వస్తోంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ఆటోలు, ద్విచక్ర వాహనాలు, లారీల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో పాటు రూ.667 కోట్లు నిధులను కూడా విడుదల చేయించారు. ఈ రోడ్డు వాడరేవు నుంచి పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదుగా నకరికల్లు అడ్డరోడ్డు వరకు 81.5 కి.మీ మేర రహదారి నిర్మాణం.. వెడల్పు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఓడరేవు-పిడుగురాళ్ల వరకు 47 కిలోమీటర్లు వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారిగా నిర్మాణాన్ని చేస్తున్నారు. కాగా ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు, ప్రభుత్వం పనులను ముమ్మరంగా చేయిస్తోంది. ఈ రహదారి నిర్మాణం కోసం 103 హెక్టార్ల భూమి అవసరం కాగా ప్రభుత్వ భూమి, మిగతా భూమిని ప్రజల నుంచి సేకరిస్తున్నారు. ఈ రహదారి నాలుగు లైన్లతో నిర్మాణం చేపట్టనున్నారు. జాతీయ రహదారికి 167-ఏగా పేరు పెట్టారు. 24 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేయనున్న రహదారికి ఆధునిక యంత్ర పరికరాలతో పనులు చేయిస్తున్నారు. ఈ రహదారి నిర్మాణంలో 37 కిలో మీటర్లు రోడ్డు బాపట్ల జిల్లా పరిధిలోనే ఉంది. ఈ జాతీయ రహదారి వినియోగంలోకి వస్తే అటు పర్యాటక రంగం, ఇటు రియల్ రంగం వృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. చిన్న హోటళ్ల నుంచి పెద్ద రిసార్టులు, చిరువ్యాపారులకు ఉపాధి దొరుకుతుంది. చీరాల మండలంలోని వాడరేవు ప్రధాన రహదారిని వెడల్పు చేయడంతో పాటు నాలుగు మేజర్ బ్రిడ్జిలు, ఆరు అండర్‌పాస్ బ్రిడ్జిలను కూడా ప్రారంభించారు. ఈ 167-ఏ అందుబాటులోకి వస్తే చీరాల్లో అన్నదాతలు పండించిన పంటల ఎగుమతులు పెరగడంతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు కేవలం నాలుగు గంటల్లోనే చేరుకోవచ్చు. రోడ్డు మూసి వేసి ప్రత్యామ్నాయ మార్గం చూపడంతో సమయం ఎక్కువవుతోంది. గుంతల రోడ్డు వల్ల, ట్రాఫిక్ వల్ల జనం తిప్పలు పడుతున్నారు. ఆటో చార్జీలు కూడా పెరిగాయి. పిల్లర్ నిర్మాణం త్వరగా పూర్తి చేస్తే ఇబ్బందులు తప్పుతాయని ప్రయాణికులు కోరుతున్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి

బల్లికురవ: గ్రామాల వారీగా రేషన్ పంపిణీలో డీలర్లు అవకతవకలకు పాల్పడకుండా సక్రమంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు సరుకులు కార్డు దారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ రవి నాయక్ కోరారు. శుక్రవారం 21 పంచాయితీల్లోని చౌకధరల దుకాణా డీలర్లతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఐవీఆర్ఎస్ కాల్ సమాచారంతో ప్రభుత్వం కార్డు దారుల నుంచి నేరుగా రేషన్ పంపిణీ సమాచారాన్ని తెలుసుకుంటుందని కార్డు దారుల నుంచి ఫిర్యాదులు అందకుండా పంపిణీ సకాలంలో చేపట్టాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జె.పంగులూరు: పంగులూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గోరంట్ల అనిల్ కుమార్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ విస్తరణ పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

బల్లికురవకు ఇంటర్ పరీక్ష కేంద్రం మంజూరు

బల్లికురవ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని బోర్డు మంజూరు చేసిందని ప్రిన్సిపాల్ కె. సుధాకర్ శుక్రవారం తెలిపారు. మార్చి 1 నుంచి జరిగే ఈ పరీక్షలకు 5 రూంలు కేటాయిస్తున్నామన్నారు. రోల్ పెంచాలని ఇందుకు తల్లిదండ్రులు, విద్యార్థులు సహకారం అందించాలని కోరారు.

వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి


మోటుపల్లి వీరభద్ర స్వామి దేవాలయంలో కలెక్టర్


వీరభద్రస్వామి ఆలయంలో శాసనాలను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ వెంకట మురళి

చినగంజాం: మోటుపల్లిలోని చారిత్రాత్మక వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ వెంకట మురళి అన్నారు. మోటుపల్లి గ్రామంలోని భూముల రీ సర్వేను పరిశీలించేందుకు విచ్చేసిన ఆయన కాకతీయుల కాలం నాటి వీరభద్రస్వామి దేవాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయులు అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాలకు కేంద్రంగా నిలచిన మోటుపల్లి రేవు వారికి ఇవేల్పుగా నిలిచిన వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ రూపురేఖలను చెక్కుచెదరనీయకుండా.. పరిసరాలను అభివృద్ధి చేసి ఒక గొప్ప సందర్శనా క్షేత్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన ఆలయంలోని వీరభద్ర స్వామిని సందర్శించి, ఆలయ ప్రాంగణంలో రాతి స్తంభాలపై లిఖించిన శాసనాలను పరిశీలించారు. ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, గ్రామ సర్పంచ్ వి. సాంబశివరావు, స్థానిక గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

పేదరికం నుంచి బయట పడాలి

పర్చూరు(చినగంజాం): పర్చూరు మండల సమాఖ్య అధ్యక్షులకు విజన్ బిల్డింగ్ గురించి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం కె. రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. పేదరికం నుంచి బయట పడాలంటే ఆ కుటుంబంలో ఏయే కార్యక్రమాలు ఉండాలి అని గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించే విధంగా శిక్షణ ఇచ్చారు. తదుపరి గ్రూపులుగా విభజించి వారి ద్వారా పేదరికం అంటే ఏమిటీ? పేదరికం నుంచి బయట పడాలంటే ఏం చేయాలనే అంశాలపై చార్టుల ద్వారా వివరించారు.


శిక్షణ ఇస్తున్న సిబ్బంది

ముఖ్యంగా విద్యా, వైద్యం జీవనోపాధులు పెంపొందించుట గురించి మౌలిక వసతుల గురించి చర్చించారు. సీసీలు ఎం. శ్రీనివాసరావు, యు. విజయకుమార్, పి. ప్రమీల, జె. నరసింహరావు పాల్గొన్నారు.

సస్యరక్షణపై అవగాహన కోసం యాప్


రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

పర్చూరు(చినగంజాం): రైతులకు పంటల సస్యరక్షణ యాప్‌పై విజయవాడ కేంద్రీయ సస్యరక్షణ శాస్త్రవేత్తల బృందంచే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలం పిలుస్తోంది రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాగులపాలెం గ్రామంలోని శనగ, పొగాకు పొలాల వద్ద రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి డాక్టర్ బొల్లి వేణు బాబు మాట్లాడుతూ వివిధ పంటల్లో చీడపీడల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వ భారత వ్యవసాయ శాఖ వారిచే (ఎన్‌పీఎస్ఎస్) జాతీయ చీడపీడల పర్యవేక్షణ వ్యవస్థ యాప్‌ని ప్రవేశ పెట్టామన్నారు. డాక్టర్ కొల్లా వీరయ్య చౌదరి మాట్లాడుతూ యాప్ ద్వారా రైతులకు పొలాల్లో చీడపీడలను త్వరితంగా గుర్తించి వాటి నివారణకు సత్వర సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. డాక్టర్ ప్రేమ రంజితం, ఏడీఏ ఎన్. మోహనరావు, మండల వ్యవసాయాధికారి ఎస్. రామ్మోహన రెడ్డి, ఆదర్శ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలతో ఆదాయం


గ్రామ పంచాయతీ సెక్రటరీలతో మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి శివనారాయణ

జె.పంగులూరు: చెత్త నుంచి గ్రామ పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని డివిజనల్ పంచాయతీ అధికారి బి. శివ నారాయణ అన్నారు. శుక్రవారం రామకూరు పంచాయతీని పరిశీలించారు. చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీలు చెత్త నుంచి వర్మి ఎరువులు తయారు చేసి మంచి లాభాలు పొందవచ్చన్నారు. గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ కె. స్వరూపరాణి, ఈఓ ఆర్‌బీకే సుమంత్ గ్రామ పంచాయితీ సర్పంచ్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించండి


రుణాల చెక్ అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ ప్రదీప్ తదితరులు

చినగంజాం: బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకొని తిరిగి సకాలంలో చెల్లించాలని చినగంజాం యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ అన్నారు. మండలంలోని వెలుగు ఆధ్వర్యంలో ఏపీఎం సుబ్బారావు అధ్యక్షతన శుక్రవారం యూనియన్ బ్యాంక్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ చేతుల మీదుగా లఘుపతి దీదీ అనే పథకం కింద 5 మంది సభ్యులకు రూ. 8 లక్షల రుణాలు పంపిణీ చేశారు. గేదెలు ఉన్నటువంటి వారికి గడ్డి, దాణాల కొనుగోలు కోసం అందజేశారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నుంచి 2 శాతం వడ్డీ తిరిగి చెల్లించారు. సర్పంచ్ రాయని ఆత్మరావు, వైస్ సర్పంచ్ సీహెచ్ రాఘవరావు, నాయకులు సారథి, ఎన్. శ్రీను, టి. జయరావు, సీసీ శ్రీలక్ష్మి, వీఓఏ శివ పాల్గొన్నారు.

మూడు నెలలకు నీటి సాంద్రత పరీక్ష


వాటర్ బాటిళ్లను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణీత్

చీరాల టౌన్: శుద్ధజలం (మినరల్ వాటర్) అమ్మకాలు చేసే వ్యాపారులు, వాటర్ ప్లాంట్లు విధిగా నీటిని ప్రతి మూడు నెలలకు ఒకసారి పరీక్షలు చేయించకుంటే చర్యలు తప్పవని చీరాల డివిజన్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి. ప్రణీత్ హెచ్చరించారు. శుక్రవారం కావూరివారిపాలెం, కొత్తపేటలోని పలు వాటర్ ప్లాంట్లను తనిఖీ చేశారు. వాటర్ బాటిళ్లు, మంచినీటి ప్యాకెట్లు, మినరల్‌వాటర్ క్యాన్లులో ఉన్న నీటిని, పరికరాలను, పత్రాలను పరిశీలించారు. నాలుగు వాటర్ ప్లాంట్లులో నీటిని శ్యాంపిల్ తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. ప్రణీత్ మాట్లాడుతూ చీరాల ప్రాంతంలోని పలు మినరల్‌వాటర్ ప్లాంట్లుపై పత్రికల్లో కథనాలు, పలు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేస్తున్నామన్నారు.

మాతృ భాష తల్లితో సమానం


అద్దంకి : గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి


కొడవలివారిపాలెంలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


మార్టూరులో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళి

కారంచేడు: మాతృ భాష తల్లితో సమానమని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో తెలుగుతల్లి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ. ఉమామహేశ్వరరావు మాట్లాడారు.

మార్టూరు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్టూరు, కోనంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. కోనంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషకు సంబంధించి వ్యాసరచన, వక్తృత్వం, పాటల పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయురాలు పద్మావతి బహుమతులు ప్రదానం చేశారు.

చీరాల అర్బన్: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ఊరూరా జనవిజ్ఞానం, ఆలిండియా ఘంటసాల చైతన్య ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో పేరాల రోడ్డులోని ఘంటసాల విగ్రహం వద్ద శుక్రవారం వేడుకలను నిర్వహించారు. ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషను కూడా కాపాడుకోవాలన్నారు. ఊ.శ్రీనివాసరావు, కోటా వెంకటేశ్వరరెడ్డి, జయరామిరెడ్డి, నాగవీరభద్రాచారి, బాబూరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం మండలంలో..

పందిళ్ళపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం తెలుగు భాషా ఉత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు నాలుగు రోజులు పాటు భాషా దినోత్సవ ఉత్సవాలను నిర్వహించారు. అంతర్జాతీయ తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు ఉపాధ్యాయులు కల్పన, నాగరాజు, వై.రత్నం సలహాతో బాలబాలికలకు వివిధ సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.శేఖరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై పిల్లలలో దాగి ఉన్న నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు కృషి చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ చెరుకూరి రాంబాబు, వైస్ చైర్మన్ బండ్ల భారతి, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు ఊటుకూరి శ్రీమన్నారాయణ, సెక్రటరీ దశరథరామిరెడ్డి, జాయింట్ సెక్రటరీ కడెం రాముడు, శంఖం లలితాపరమేశ్వరి, ఉమ్మిటి వేణుగోపాలరావు, సీహెచ్ భవానిదేవి, నరసింహం, నీలిమ, చైతన్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం మండలంలోని మైలవరం గ్రామంలో ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు వంగెరపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగు పద్యాలు, వక్తృత్వం, పఠన పోటీలు, కథల పోటీలు, వ్యాసరచన, గుడ్ హ్యాండ్ రైటింగ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకటరావు. యం. వెంకటేశ్వర్లు, యస్. శ్రీనివాసులు, లక్ష్మీ దేవి, పద్మావతి లావణ్య పాల్గొన్నారు. అలాగే అద్దంకి సృజన ఆధ్వర్యంలో తెలుగు పద్యశాసనం ఎర్రాప్రగడ విగ్రహాలు పూలమాలలు వేశారు. గాడేపల్లి దివాకరదత్తు, వారనాసి రఘురామశర్మ, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గిడుగు రామూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావు, షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

బ్యాంకు పోస్టులు భర్తీ చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చీరాల: న్యాయ సమ్మతమైన బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. గురువారం చీరాల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగుల సంఘం యుఎఫ్‌బీయూ నాయకులు మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసి ఉద్యోగులపై పనిభారం తగ్గించాలన్నారు. బ్యాంకు ఉద్యోగులకు ఇచ్చే గ్రాట్యూటీ రూ.20లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచాలన్నారు. బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే మార్చి 24,25 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమ్మె నిర్వహిస్తామన్నారు. నాయకులు బ్రహ్మయ్య, దాసు, శ్రీనివాసరావు, దీవెన బాబు, కిషోర్, నెహ్రూ, మేడ వెంకట్రావు, పైడయ్య తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: బ్యాంకింగ్ రంగంలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని యునైటెడ్‌ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ నాయకులు అన్నారు. శుక్రవారం అద్దంకిలోని ఎస్‌బీఐ ఏడీబీ శాఖ వద్ద ధర్నా నిర్వహించారు. లోకల్ సెక్రటరీ జీవీ అప్పారావు, ఎస్. సుబ్బారావు, కేవీ నరసింహారావు, డి. కుమార్, ఎస్‌బీ, యూనియన్, కెనరా, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దాతల అపూర్వ సహకారం

ఇంకొల్లు(చినగంజాం): పాఠశాల అభివృద్ధికి దాతలందిస్తున్న సహకారం అపూర్వమైనదని ఇంకొల్లు ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎం రావి నాగేశ్వరి అన్నారు. శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం రావి నాగేశ్వరి అధ్యక్షతన దాతలు పాఠశాలకు అందిస్తున్న విరాళాల పంపిణీకి సంబంధించి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంకొల్లు ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ గరల్స్ హైస్కూల్‌లో 2023-24 లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బి. కుసుమ, ఎస్‌కే రషీదాలకు బొర్రా ఈశ్వరమ్మ మెమోరియల్ మెరిట్ అవార్డ్ రూ. 6 వేలు, రూ. 4 వేలు డాక్టర్ బొర్రా బొల్లయ్య, సరస్వతి(యూఎస్ఏ) దంపతులు బహూకరించగా వీటిని నార్నె వేణుగోపాలరావు, కరణం వాసుదేవరావులు అందజేశారు. 2024-25 విద్యాసంవత్సరంలో ప్రతి తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆరె నరసింహారావు, నాగలక్ష్మి దంపతులు జ్ఞాపకార్థం కావూరి నాగార్జున, భవాని దంపతులు రూ. 5 వేలు బహూకరించారు. పాఠశాల పూర్వ విద్యార్థిని కావూరి సాయి సుప్రియ(సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఐర్లాండ్) రూ. 40 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ వేశారు. మెరిట్ విద్యార్థులు ప్రతి సంవత్సరం ఇంటర్మీడియెట్ చదివేందుకు వీటిని అందజేశారు. అలాగే పాఠశాలకు రూ. 10 వేలు అందజేశారు. దాత షేక్ బాషా పాఠశాలకు రూ. 10 వేలు విలువ చేసే ఫ్రిజ్ అందించారు. కార్యక్రమంలో నార్నె వేణుగోపాలరావు, కరణం వాసుదేవరావు, కావూరి గంగా భవాని, షేక్ బాషా, ఎస్ఎంసీ చైర్మన్ కరి రవిశేఖర్, మేడూరి సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

చీరాల: వేటపాలెం మండలం పందిళ్ళపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మనోవికాసం వ్యవస్థాపకుడు, నిర్వాహకుడు నాయుడు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు నిర్వహించిన వర్క్‌షాపు శుక్రవారంతో ముగిసింది. 6 నుంచి 9వ తరగతి వరకు బాలబాలికలు పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లిషు భాషలకు సంబంధించి చేతిరాత, చిత్రలేఖనం, వక్తృత్వం అనే అంశాలకు సంబంధించి వర్క్‌షాపు నిర్వహించారు. మూడు రోజులు జరిగిన కార్యక్రమంలో మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులను ప్రధానోపాధ్యాయుడు ఎం.శేఖరరావు అన్నారు. కార్యక్రమానికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చీరాల జనరల్ సెక్రటరీ అత్తులూరి రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మిటి వేణుగోపాలరావు, నాగరాజు, శివశంకర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ పరిశీలన

చీరాల అర్బన్: వేటపాలెం మండలం పందిళ్ళపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను చీరాల డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి గంగాధరరావు శుక్రవారం పరిశీలించారు. ఉపాధ్యాయుల టీచింగ్ ప్లాన్లు, డైరీలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉంటుందని తెలిపారు.